క్లుప్తంగా

షూటింగ్ బాల్ పోటీల్లో విద్యార్థుల సత్తా



కంకిపాడు: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్ విద్యార్థులు తమ సత్తా చాటారు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన క్రీడాకారులను ప్రిన్సిపల్ జె.పద్మావతి సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 12, 13 తేదీల్లో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెంలో రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ టోర్నమెంట్ జరిగిందన్నారు. పోటీలకు ఈడుపుగల్లు నలంద పాఠశాల విద్యార్థులు కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారన్నారు. జూనియర్ బాలికల విభాగంలో కృష్ణాజిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన కోచ్‌ను అభినందించారు.

పేకాటాడుతున్న 10 మంది అరెస్టు

పెనమలూరు: పేకాటాడుతున్న 10 మంది వ్యక్తులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... యనమలకుదురు కృష్ణానదిలోని చీమల దిబ్బ వద్ద కొందరు వ్యక్తులు పేకాటాడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.26,150 స్వాధీనం చేసుకుని నిందితుల పై కేసు నమోదు చేశారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



కంకిపాడు: స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని జగనన్న సచివాలయాల మండల చైర్మన్ రాచూరి చిరంజీవి అన్నారు. యేసుపాదం చారిటబుల్ సొసైటీ విజయవాడ ఆధ్వర్యంలో కంకిపాడు లాకు ప్రాంతానికి చెందిన 20 నిరుపేద కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రెండు సిమెంటు కట్టలు, నిత్యావసరాలను సోమవారం పంపిణీ చేశారు. చిరంజీవి మాట్లాడుతూ దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకుని, కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ కె.జాషువా, సిబ్బంది పాల్గొన్నారు.

రామవరప్పాడులో పారిశుద్ధ్య చర్యలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రధాన గ్రామంతో పాటు అంతర్గత డ్రెయిన్లు పూడికతీయడం, చెత్తను తొలగించి డంపింగ్ యార్డ్‌లకు తరలించడం వంటి చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు మాట్లాడుతూ గ్రామంలో సిండికేట్ బ్యాంక్ కాలనీ, బల్లెంవారి వీధి, రాజుల బజార్, కాల్వగట్టు ప్రాంతాల్లో సమస్యాత్మకంగా మారిన సైడు డ్రెయిన్లు పూడిక తీయించామన్నారు. ప్రతి ఇంటికి పారిశుద్ధ్య బండ్లు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నట్లు వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఏమైనా సమస్యలు తలెత్తితే పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

పాఠశాలకు క్రీడా పరికరాలు అందజేత



కేసరపల్లి(గన్నవరం): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని రోటరీక్లబ్ అధ్యక్షులు జాస్తి విజయ భూషణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కేసరపల్లి జెడ్పీ హైస్కూల్‌కు సోమవారం రోటరీక్లబ్ ద్వారా రూ. 10 వేలు విలువైన ఆట పరికరాలు, కంప్యూటర్ ప్రింటర్‌ను అందజేశారు. పలువురు దాతలు చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చిన వడ్డీ నగదును విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులుగా పంపిణీ చేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు, రోటరీక్లబ్ కార్యదర్శి నర్రా సీతారామారావు, రోటేరియన్లు గన్నె వెంకట్రావు, కెఎస్. జగదీశ్వరరావు, టీఎస్ఆర్‌కె. ప్రసాద్, హెచ్‌ఎం నరేష్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

26న కొబ్బరి చిప్పల వేలం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో కొబ్బరి చిప్పలు సేకరించటానికి రెండు సంవత్సరాలకు గాను వేలం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి యూవీ ప్రసాదరావు అన్నారు. ఈ మేరకు సోమవారం వివరాలు తెలుపుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 9వ తేదీ నుంచి 2025 వరకు కొబ్బరి చిప్పల పోగుచేసుకునే లైసెన్సు హక్కుల వేలం ఉందన్నారు. ఈ నెల 26 న దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహిస్తామన్నారు.

సమరయోధుల ఆశయాలు స్ఫూర్తి



గోసాలలో నాభూమి-నాదేశం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీడీఓ సునీతాశర్మ, సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెనమలూరు: భారతదేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన సమరయోధుల ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంపీడీఓ సునీతా శర్మ అన్నారు. మండల పరిధి గోసాల గ్రామంలో సోమవారం నాభూమి-నాదేశం కార్యక్రమం ఘనంగా చేశారు. జాతీయ జెండాను ఎగురవేసి దేశ భక్తి గీతాలు ఆలపించారు. మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సునీతాశర్మ మాట్లాతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నాభూమి-నాదేశం, నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. నేలతల్లిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని పిలుపు నిచ్చారు. నూతనంగా ఏర్పాటు చేసిన శిలాఫలకం పై సమరయోధులు, అమర వీరుల పేర్లు రాశారు. విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు, ఎంఈఓ శేషగిరిరావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ పోలవరపు రవి, ఉపసర్పంచ్ ఎండి.దాదా, పంచాయతీ వార్డు సభ్యులు తాటి వసంతలక్ష్మి, షేక్.పీర్ అహ్మద్, గుమ్మడి శ్రీనివాసరావు, కనకలక్ష్మి, ఈవో ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను స్మరించుకోవాలి

కంకిపాడు: అమరుల త్యాగాలను స్మరించుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయభాస్కర్ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరులో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామంలో మొక్కలు నాటి, పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. ఉదయభాస్కర్ మాట్లాడుతూ జాతి కోసం ప్రాణాలు అర్పించిన



ఉంగుటూరులో హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీ

వీరులను స్మరించుకోవాలని, దేశ సమైక్యతకు నిత్యం పాటుపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈ.శివనాగలక్ష్మి, ఎంపీటీసీ బి. సురేష్, ఈఓ శేఖర్, పలువురు వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు. కంకిపాడు లాకులు ఎంపీపీ పాఠశాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, పలువురు సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

ఉంగుటూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్- హర్ ఘర్ తిరంగాలో భాగంగా ప్రభుత్వం అందజేసిన జాతీయ జెండాలు స్వయం సహాయక సంఘం గ్రూపు లీడరు, ఎన్ఆర్‌జీఎస్ మేట్లుకు పంపిణీ చేశారు. ప్రజలను ప్రోత్సహించేందుకు హర్ ఘర్ తిరంగా ప్రచారాన్ని బైక్ ర్యాలీ ద్వారా ఎంపీడివో శేషగిరిరావు నేతృత్వంలో నిర్వహించారు.

నా భూమి, నా దేశం శిలాఫలకాలు ఆవిష్కరణ

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద, గొల్లనపల్లి, గోపవరపుగూడెం, బీబీగూడెం, తెంపల్లి గ్రామాల్లో సోమవారం నా భూమి, నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు జరిగాయి. ఆయా గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా ఎంపీడీవో ఇ.సత్యకుమార్, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, పీఆర్ ఏఈ దాసు, ఏపీవో సత్య ప్రియ, ఎంఈవో-2 కమల వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆవిష్కరించి పంచప్రాణ ప్రతిష్ఠ నిర్వహించి భూమికి, వీరులకు వందనం సమర్పించారు. గోపవరపుగూడెంలో సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు మొక్కలు నాటి పూజ్య బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేశారు. పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: దేశ స్వాతంత్య్రం కోసం అలుపెరుగని పోరాటం చేసి ప్రాణాలను అర్పించిన అమరవీరుల జీవితాలు నేటి తరం విద్యార్థులకు స్ఫూర్తిదాయకం కావాలని బాపులపాడు ఎంఈవో రామ్ బాల సింగ్ అన్నారు. వీరవల్లిలోని జెడ్పీ హైస్కూల్లో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా నా మట్టి-నా దేశం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. బ్రిటీష్ పాలకుల నుంచి దేశ విముక్తి కోసం స్వాతంత్య్రోద్యమంలో పాల్గొన్న నాయకుల సేవలను స్మరిస్తూ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిలాఫలాకాన్ని ఎంఈవో ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జెండా వందం నిర్వహించారు. సర్పంచ్ పిల్లా అనిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.నిర్మల పాల్గొన్నారు. వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా విద్యార్థులు సీతారామపురం సెంటర్ వరకు త్రివర్ణ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు యదునందన్, నటరాజు, వందన రాణి సురేష్ పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ



ప్రొద్దుటూరులో ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న సుధారాణి



తెన్నేరులో ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కొడాలి మేరిమ్మ

కంకిపాడు: స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. ఖాళీ అయిన సర్పంచ్, వార్డు స్థానాలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఇందులో భాగంగా కంకిపాడు (9వ వార్డు, జనరల్), ప్రొద్దుటూరు (4వ వార్డు జనరల్), తెన్నేరు (7వ వార్డు ఎస్సీ)కి రిజర్వు అయ్యాయి. ఆయా స్థానాలకు ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ నామినేషన్లను స్వీకరించారు. ఉపసంహరణ ప్రక్రియ పూర్తయ్యే సరికి తెన్నేరు ఎస్సీ రిజర్వు స్థానం నుంచి కొడాలి మేరిమ్మ ఒకే నామినేషన్ దాఖలైంది. ప్రొద్దుటూరు జనరల్ స్థానానికి బొట్ట సుధారాణి నామినేషన్ ఒక్కటే మిగిలి ఉండటంతో ఆయా స్థానాలకు ఇరువురునీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాలను ఎన్నికల అధికారులు వెంకటేశ్వరరావు, శరాబందిరాజు అందించారు.

కంకిపాడు బరిలో ముగ్గురు...

కంకిపాడు పంచాయతీ 9వ వార్డు జనరల్‌కు రిజర్వు అయ్యింది. ఈ స్థానానికి వైఎస్సార్ సీపీ మద్దతుతో మలబంటి దుర్గాప్రసాద్ అలియాస్ చిన్నమ్ములు పోటీలో ఉన్నారు. టీడీపీ నుంచి చలవాది రాజా, జనసేన, బీజేపీ సంయుక్త అభ్యర్థిగా పి.ప్రవీణ్‌కుమార్ పోటీలో ఉన్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి వి.సీతారామరాజు అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించారు. ఎన్నిక అనివార్యం కావటంతో ఈ నెల 19న పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ టీ.ఉదయభాస్కర్ తెలిపారు.

ఉంగుటూరు:మండలంలో పలు గ్రామ పంచాయతీల్లో వార్డు సభ్యుల ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం నామినేషన్ల ఉప సంహరణ, పాల్గొనే అభ్యర్థులను ప్రకటించారు. తేలప్రోలు నాలుగో వార్డు ఎన్నికకు ప్రధాన పార్టీలైన వైఎస్సార్ సీపీ, టీడీపీ పార్టీలు బలపరచిన వింత శ్రీనివాసరెడ్డి (వైఎస్సార్ సీపీ), జి.సందీప్(టీడీపీ) అభ్యర్థులు పోటీలో ఉన్నారు. తుట్టగుంట 5వ వార్డుకు బండి నాగేశ్వరమ్మ, ఎన్ఏ పేట 4వ వార్డుకు కొల్లి రవికుమార్ ఏకగ్రీవంగా నిలిచారని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. కాగా గారపాడు 8వ వార్డు సభ్యుల ఎన్నికకు ఎవరూ నామినేషన్ వేయలేదు.

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం 9వ వార్డుకు జరిగే ఉప ఎన్నికకు నామినేషన్లు వేసిన వారిలో అయిదుగురు సోమవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దండు సుబ్రహ్మణ్యంరాజు, గుంటక సుబ్బారెడ్డి, పోలారెడ్డి దర్గారెడ్డి, ఆరేపల్లి ప్రవీణ్,ఆరేపల్లి ప్రశాంత్‌లు నామినేషన్లు ఉపసంహరించుకోగా పోటీలో బొమ్మిన శ్రీనివాసరావు, వల్లూరు వెంకటశివ ఉన్నారని రిటర్నింగ్ అధికారి సిహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన ముగ్గురు వార్డు సభ్యులు

గన్నవరం: మండలంలో ఖాళీగా ఉన్న మూడు గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పదవులకు చేపట్టిన ఉప ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఉప ఎన్నికలకు సంబంధించి ఈ నెల 10వ తేదితో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. ముస్తాబాద-1వ వార్డుకు ధనకొండ అంజలి, కొండపావులూరు-6వ వార్డుకు కూచిపూడి జ్ఞానసుందరం మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో ఇరువురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిన్నఅవుటపల్లిలోని 6వ వార్డుకు తొలుత మూడు నామినేషన్లు వచ్చాయి. సోమవారం ఇద్దరు నామినేషన్లను విత్‌డ్రా చేసుకోవడంతో కటికల సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎలక్షన్ అధికారులు ప్రకటించారు. దీంతో ముగ్గురు వార్డుల సభ్యులు ఏకగ్రీవంగా గెలిచినట్లుగా ఎంపీడీవో సత్యకుమార్ తెలిపారు.

రేమల్లే ఉప సర్పంచ్ పదవికి వడ్లపట్ల రాజీనామా

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రేమల్లే గ్రామ ఉప సర్పంచ్ వడ్లపట్ల శివరామకృష్ణ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావుకు సోమవారం ఆయన అందించారు. తన వ్యక్తిగత కారణాలతో ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నట్లుగా శివరామకృష్ణ ప్రకటించారు. 2021 ఏప్రిల్ జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆయన రేమల్లే 3వ వార్డు సభ్యుడిగా ఎన్నికై, ఆ తర్వాత ఉప సర్పంచ్ పదవి దక్కించుకున్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

పెనమలూరు: రైతులు పండించే పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ తెలిపారు. పెదపులిపాక గ్రామంలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఏవో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం, కౌలు కార్డుతో మండల పరిధిలో ఉన్న ఆయా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఏఏవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల వివరాలు, విస్తీర్ణం వివరాలు నమోదు చేసి ఫోటోలు తీసి ఈ క్రాప్ నమోదు చేస్తారన్నారు. ఈ క్రాప్ చేయించుకోక పోతే రైతులకు నష్టం జరుగుతుందన్నారు. ఈ క్రాప్‌తో ప్రభుత్వ పథకాలు, బీమా అమలవుతుందని వివరించారు. ఈ



పెదపులిపాకలో ఈ క్రాప్ చేస్తున్న ఏవో శైలజ

నెలాఖరు కల్లా రైతులు ఈ క్రాప్ చేయించుకోవాలని తెలిపారు. ఈ సీజన్‌లో పంటలు సాగు చేస్తే ఆ సీజన్‌లో తప్పనిసరిగా ఈ క్రాప్ చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏవో స్వయంగా ఈ క్రాప్ నమోదు చేసి పరిశీలించారు.

161 మందికి ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ



బస్‌పాస్‌లు చూపుతున్న విద్యార్థినులతో ఎంపీపీ రవి, తోట వెంకయ్య

గన్నవరం రూరల్: విద్యార్థుల ఉన్నతి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అనగాని రవి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య తెలిపారు. వారి ఇద్దరి ఆర్థిక సహకారంతో 161 మంది విద్యార్థులకు సోమవారం పాఠశాలలో ఉచిత బస్ పాస్‌లు పంపిణీ చేశారు. విద్యార్థులు సౌకర్యార్థం మండలంలోని పాఠశాలల్లో చదువుతూ దూర ప్రాంతం నుంచి వస్తున్న అందరికీ బస్‌పాస్‌లను ఉచితంగా అందించినట్లు చెప్పారు.

అనారోగ్యం, ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు

ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్

గన్నవరం: నియోజకవర్గ ప్రజలకు అనివార్య పరిస్థితుల్లో ఎదురయ్యే అనారోగ్య సమస్యలు, ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ వైద్య సేవలందించేందుకు ప్రత్యేక కార్యచరణను రూపొందించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కరోనా మహమ్మారి వంటి విపత్కర పరిస్థితులను ప్రజలందరూ ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. కరోనా వల్ల అనేక మంది ప్రాణాలు పోవడంతో పాటు అనేక కుటుంబాలు అనారోగ్య సమస్యలు, ఆర్థిక పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. గతంలో నియోజకవర్గ ప్రజలు సంక్షోభంలో ఉన్నప్పుడు అనేక సమయాల్లో వారికి సహాయపడేందుకు అంకితభావంతో పనిచేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూడా అదే సేవాభావంతో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రజలు ఏదైనా అనారోగ్య సమస్యలు, ప్రమాదాలు ఎదురైనప్పుడు వారికి పూర్తిస్థాయిలో సహకరించేందుకు, ఉత్తమ వైద్యం కోసం తన కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. వైద్య పరంగా ప్రజలకు తక్షణ సూచనలు అందించేందుకు తన కార్యాలయ సిబ్బంది ఎలప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. వైద్య నిపుణులతో తమకు ఉన్న ప్రత్యక్ష సంబంధాలను వినియోగించి వారికి వెంటనే మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మణిపూర్ ఘటనలకు నిరసనగా ర్యాలీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్‌లో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు జాతీయ జెండాలు చేబూని మణిపూర్ దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యావత్ దేశం తలదించుకునే విధంగా మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం ఉదాసీన వైఖరితోనే మణిపూర్‌లో క్రైస్తవ గిరిజన మహిళలపై దాడులు పెట్రేగుతున్నాయని ఆరోపించారు. అనంతరం బాపులపాడు రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కె.వెంకటరమణకు వినతిపత్రం అందించారు. దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు



డీటీకి వినతిపత్రం అందిస్తున్న మహిళలు

యండమూరి ఉమామహేశ్వరి, జిల్లా కార్యదర్శి రమాదేవి, గన్నవరం నియోజకవర్గ అధ్యక్షురాలు ఇంటి చంద్రిక, సభ్యులు నల్లా పార్వతి, పిల్లా రంగామణి, గగ్గులోతు జ్యోతి, వీరంకి పుష్పలత, సరిపల్లి విజేత, పంతం అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఎలిమెంటరీ స్కూల్లో పోలింగ్ కేంద్రం

నున్న(విజయవాడరూరల్): ఈ నెల 19వ తేదీన జరిగే నున్న గ్రామ 9వ వార్డు ఉప ఎన్నికకు గ్రామంలోని కోటకట్ట సెంటర్లో ఎలిమెంటరీ స్కూల్‌ను పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు తెలిపారు. సోమవారం ఎలిమెంటరీ స్కూల్‌ను పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, రిటర్నింగ్ అధికారి సిహెచ్.శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు.

ఎంపీపీ పాఠశాల తనిఖీ

గన్నవరం రూరల్: మండలంలోని వెదురుపావులూరు ఎంపీపీ పాఠశాలను సోమవారం ఎంఈవో రాంబాల్ సింగ్ తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి హెచ్‌ఎం కుమార్ బాబుకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా బోధన చేయాలని, పాఠశాల ఆవాస ప్రాంతంలో బడి బయట విద్యార్థులు ఉండరాదని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్య, పోషకాహారం అందిస్తుందని తెలిపారు. సీఆర్‌పీ దుర్గాదేవి, వంట ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు.

విద్యార్థులు గొప్ప నాయకులుగా ఎదగాలి



మధురానగర్: విద్యార్థులు గొప్ప నాయకులుగా ఎదగాలని డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ మోకా సత్తిబాబు సూచించారు. పోరంకి భాష్యం బ్లూమ్స్ స్కూల్లో 2023-24 విద్యా సంవత్సరానికిగానూ కొత్తగా ఎన్నికైన విద్యార్థి నాయకుల ప్రమాణస్వీకారోత్సవం సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సత్తిబాబు మాట్లాడుతూ విద్యార్థులు భారతావనిని విజయపథంలో నడిపించాలని ఆకాంక్షించారు. గౌరవ అతిథి ఎన్.సి.సి. లెఫ్టినెంట్ ఎన్. నిరంజన్, భాష్యం బ్లూమ్స్ జెడ్ ఈఓ వరలక్ష్మి, ఈఓ జోషి, ప్రిన్సిపాల్ డాక్టర్ జైన్ సోనాల్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఏపీఎన్జీవో మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలో జరగనున్న ఏపీ ఎన్జీవో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ ఎన్జీవో గన్నవరం యూనిట్ అధ్యక్షుడు వి.సాంబశివరావు పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ నగర్‌లోని గ్రామ సచివాలయం-3 ప్రాంగణంలో సోమవారం ఏపీ ఎన్జీవో ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో రాష్ట్ర మహాసభలను వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహాసభలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. సభాధ్యక్షుడిగా సీహెచ్ సాంబశివరావు వ్యవహరించగా, ఏపీ ఎన్జీవో గన్నవరం యూనిట్



రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్జీవో నాయకులు

మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి సురేంద్ర, సంయుక్త కార్యదర్శి సీవీఎల్ఎస్ఆర్వీ ప్రసాద్, కార్యవర్గ సభ్యుడు కె.సురేష్ పాల్గొన్నారు.

విభజనపై ఫొటో ఎగ్జిబిషన్



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు ఇండియన్ బ్యాంకు బ్రాంచ్‌లో సోమవారం విభజన భయానక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. స్వాతంత్య్ర సమరయోధురాలు చావా బేబి సరోజిని ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో మంది వీరుల త్యాగాల ఫలితంగా మన దేశానికి స్వాతంత్య్రం వచ్చిందన్నారు. డీజీఎం వీవీఆర్ సుబ్రహ్మణ్యం, ఏజీఎం బిశ్వనాథ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

త్రివర్ణ రంగుల్లో ఎయిర్‌పోర్ట్



స్వాతంత్య్ర వేడుకలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) ముస్తాబైంది. ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ భవనాన్ని త్రివర్ణ పతాక రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఎరైవల్, డిపార్చర్ ప్రాంగణాలు, ఎయిర్‌లైన్స్ కార్యాలయాలను మూడు రంగుల బెలూన్లు, రంగవల్లికలతో తీర్చిదిద్దారు.

– గన్నవరం

నిరాశ్రయులైన వృద్ధులకు అండగా నిలవాలి

గన్నవరం: నిరాశ్రయులైన వృద్ధులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని బార్ అసోసియేషన్ ఆఫ్ గన్నవరం శాఖ అధ్యక్షుడు తిరివీధి వెంకయ్య పిలుపునిచ్చారు. స్థానిక రాయ్‌నగర్‌లో సోమవారం వెంకయ్య జన్మదినం సందర్భంగా వంద మంది వృద్ధులకు జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని, సర్పంచ్ నిడమర్తి సౌజన్య చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు ఆయన అన్నదానం చేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. బాలకృష్ణమూర్తి, తల్లి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాచేటి రూతమ్మ, పలువురు న్యాయవాదులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



